క్లుప్తంగా

ప్రణాళికాబద్ధంగా బోధన జరగాలి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ

చిన్నకోదూరు(సిద్దిపేట): ప్రణాళికాబద్ధంగా విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన జరగాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రామంచ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. 'మన ఊరు–మన బడి' పనులపై చర్చించారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో బోధన ఉపకరణాలతో పాఠాలు బోధించి విద్యార్థుల హాజరు శాతం పెంచేలా చూడాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ షరీఫ్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు



పనులను అడ్డుకుంటున్న కమిషనర్ గణేశ్‌రెడ్డి

దుబ్బాక: అనుమతులు లేకుండా భవన నిర్మాణ పనులను చేపడితే చర్యలు తప్పవని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం దుబ్బాక పట్టణంలో సెట్ బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను ఆయన అడ్డుకున్నారు. సెట్ బ్యాక్ చేసిన తర్వాతే నిర్మాణం చేపట్టాలని యజమానిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో భవన నిర్మాణాలు చేపట్టే వారు మున్సిపల్ అనుమతులు తప్పక తీసుకోవాలన్నారు. సెట్ బ్యాక్ లేకుండా నిర్మిస్తే మున్సిపల్ చట్టం ప్రకారం భవనాలను కూల్చివేస్తామని హెచ్చరించారు.

కత్తెర పురుగు నివారణకు లింగాకర్షక బుట్ట వాడాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సహాయ సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ అధికారి నీలారాణి అన్నారు. మంగళవారం మండలంలోని అలిరాజ్‌పేట గ్రామంలో రైతులకు పంటల సాగు విధానం, పురుగు నివారణ అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. లింగాకర్షక బుట్టలను వాడుకోవాలని సూచించారు. అలాగే యాజమాన్య పద్ధతులను పాటించాలని కోరారు. అనంతరం మొక్కజొన్న పంటలను పరిశీలించి, రైతులకు లింగాకర్షక బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, ఏఓ వసంతరావు, ఏఈఓ శరణ్య, ఎంపీటీసీ రమ్యారవి, రైతులు సత్తిరెడ్డి, రామచంద్రారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా..



ఆస్పత్రికి రిఫ్రిజిరేటర్‌ను బహూకరిస్తున్న సుల్తానా ఉమర్

దుబ్బాక: కష్టాల్లో ఉన్న పేద ప్రజలకు అండగా నిలవడమే తన లక్ష్యమని సామాజిక సేవకురాలు, ఇందూప్రియాల్ అంగన్‌వాడీ టీచర్ మహ్మద్ సుల్తానా ఉమర్ అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలోని ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రికి రిఫ్రిజిరేటర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు కలగకుండా మెడిసిన్ భద్రపరిచేందుకు రిఫ్రిజిరేటర్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్ హేమరాజ్ సింగ్‌కు అందజేశామన్నారు. సుల్తానాకు హేమరాజ్ సింగ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో రైతులు పరేషాన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ పరిపాలనలోనే రైతులకు లబ్ధి చేకూరిందని, రైతుల పక్షపాతి అని చెప్పుకుంటున్న బీఆర్‌ఎస్ పార్టీది రైతు వ్యతిరేక ప్రభుత్వమని సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు చంద్రం, బొమ్మల యాదగిరి, అత్తు ఇమామ్, సూర్యవర్మలు అన్నారు. రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను అందజేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిద్దిపేట పట్టణంలోని విద్యుత్ ఎస్‌ఈ (విద్యుత్ భవన్) కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో లక్ష్మి, యాదగిరి, కలిముద్దీన్, సతీశ్‌గౌడ్, శంకర్, భిక్షపతి, రామచంద్రం, గణేశ్, సయ్యద్ అతీక్ పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం



అక్కన్నపేట(హుస్నాబాద్): పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ లలిత



సిద్దిపేటరూరల్: పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ బాలకృష్ణ, సర్పంచ్ ఆంజనేయులు

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎంపీపీ మాలోతు లక్ష్మి అన్నారు. మంగళవారం అక్కన్నపేట మండల కేంద్రం సుమారుగా రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణానికి జెడ్పీటీసీ భూక్య మంగతో కలిసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు, మాజీ జెడ్పీటీసీ మాలోతు భీలునాయక్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతారావు, వార్డు సభ్యులు రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

మద్దూరు(హుస్నాబాద్): గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని సర్పంచ్ బద్దిపడిగె లలితకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో మొదటి వార్డులో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామానికి చెందిన ముస్త్యాల రాములుకు సంబంధించిన రైతు బీమా చెక్కును ఆయన కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింతల ఎల్లయ్య, వార్డుసభ్యులు సరిత, ముస్త్యాల శ్రీనివాస్, శనిగరం సత్యనారాయణ, కోఆప్షన్ మెంబర్ మహ్మద్, మాజీ ఎంపీటీసీ దేవరాజు పాల్గొన్నారు.

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది గ్రామంలో రూ. 20లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ బాలకృష్ణ, సర్పంచ్ ఆంజనేయులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హరీశ్, నాయకులు ఎల్లారెడ్డి, మల్లేశం, సెక్రటరీ అరుణ పాల్గొన్నారు.

అమరుల త్యాగం మరువలేనిది



గజ్వేల్ పట్టణంలో ర్యాలీ

సిద్దిపేటఎడ్యుకేషన్: దేశం కోసం ప్రాణాలను అర్పించిన అమర సైనికుల త్యాగాలు మరిచిపోలేనివని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) జిల్లా కన్వీనర్ వివేక్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పుల్వామా దాడిలో అమరులైన సైనికుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి పవన్, నాయకులు ఫణిందర్, సంజయ్, రాకేష్, గుణ, మమత తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: పుల్వామ ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు హైందవులు నివాళులర్పించారు. మంగళవారం రాత్రి పట్టణంలోని స్వామి వివేకానంద చౌరస్తా నుంచి ఇందిరాపార్కు చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

బెజ్జంకి(సిద్దిపేట): పుల్వామ ఉగ్రదాడిలో అసువులు బాసిన భారత జవానులకు మంగళవారం రాత్రి ప్రజా సంఘాల నాయకులు బెజ్జంకిలో కవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.

కంటి వెలుగుపై అవగాహన కల్పించాలి



అద్దాలు అందజేస్తున్న ఫైజా అహ్మద్

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించి, పరీక్షలు చేయించుకునేలా చూడాలని ట్రైనీ కలెక్టర్, నంగునూరు ఎంపీడీఓ ఫైజా అహ్మద్ అధికారులకు సూచించారు. వెంకటాపూర్‌లో జరుగుతున్న వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించి అద్దాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి కంటి వెలుగుపై ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యుడు ప్రవీణ్‌నాయక్, ఇన్‌చార్జి శివకేశవరెడ్డి, వెంకటరమణ, సావిత్రీ, స్వర్ణలత, కవిత, లింగంగౌడ్, మల్లేశం పాల్గొన్నారు.

'ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి'

కోహెడరూరల్(హుస్నాబాద్): సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని హుస్నాబాద్ నియోజకవర్గ బీజేపీ నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటేశ్వరపల్లి, మైసంపల్లి పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన శక్తి కేంద్రాల బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రజావ్యతిరేక, నియంత పాలనకు వ్యతిరేకంగా ప్రజలు రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి తగ్గిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, నాయకులు సురేష్, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పల్లె లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

డ్రా తీయడానికి ఏర్పాట్లు చేయాలి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మున్సిపాలిటీలో నిర్మించిన డబుల్ బెడ్రూంలకు అర్హులను ఈ నెల 16న డ్రా ద్వారా ఎంపిక చేస్తామని ఇన్‌చార్జి ఆర్డీవో అనంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం డబుల్ ఇళ్లను ఆయన పరిశీలించారు. 264 ఇళ్లు సిద్ధం కావడంతో వాటిని అర్హులైన పేదలకు అందించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు డ్రా తీయనున్నట్లు చెప్పారు. పట్టణంలోని 20వ వార్డులో అధికారుల బృందాలు ఇంటింటికీ తిరిగి అర్హుల జాబితాలను తయారు చేశారన్నారు. 20 వార్డుల్లో మొత్తం 342 మందిని అర్హులుగా గుర్తించామని, వీరిలోనే డ్రా పద్ధతిన లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో డ్రా తీయడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వీరి వెంట కమిషనర్ రాజమల్లయ్య, తహసీల్దార్లు ఉన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే జోడోయాత్ర

కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి



సమస్యలను తెలుసుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎత్తి చూపేందుకే పాదయాత్ర చేపట్టామని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో మంగళవారం హాథ్ సే హాథ్ జోడోయాత్రను ఆయన ప్రారంభించారు. మండలంలోని అనాజీపూర్, మంతూర్ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వృద్ధులను, యువకులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మాటలను విస్మరించి మాయమాటలతో ప్రజలను మోసం చేస్తుందని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కనకయ్యయాదవ్, కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డి, యాదగిరి, జనార్దన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, కిష్టారెడ్డి, తదితరులున్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు లేవని కాంగ్రెస్ నాయకురాలు కత్తి కార్తీకగౌడ్ అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో మంగళవారం హాథ్ సే హాథ్ జోడోయాత్ర కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవరికి టికెట్ ఇచ్చినా సమిష్టి కృషితో గెలుపు కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. దుబ్బాకలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నేరండ్ల భూమాగౌడ్, మద్దెల రాజేష్, మద్దెల సుదర్శన్, అల్లిబిల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక అభివృద్ధే లక్ష్యం

మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి



కమ్యూనిటీ భవనాలకు భూమిపూజ చేసిన అనంతరం దృశ్యం

దుబ్బాకరూరల్: మండలంలోని రామక్కపేట గ్రామంలో ఎస్సీ మాదిగ, మాల, మైనార్టీ, వంజరి, మున్నూరుకాపు, పద్మశాలి, విశ్వబ్రాహ్మణ, ముదిరాజ్, గౌడ సంఘం, యాదవ సంఘం, కమ్యూనిటీ హాల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మీటింగ్ హాల్ భవనాల నిర్మాణానికి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి భూమిపూజ చేశారు. సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రంలోని సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మారుమూల గ్రామాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొత్త పుష్పలతకిషన్‌రెడ్డి, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, సర్పంచ్ పద్మప్రభాకర్, ఎంపీటీసీ శోభస్వామి, మక్బుల్‌హుస్సేన్, బాల్‌రాజ్, రామకృష్ణప్రభు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

మండలంలోని రామక్కపేట బాలికల గురుకుల పాఠశాలలో అదనపు గదులు నిర్మాణానికి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి రూ.కోటి నిధులు మంజూరు చేశారు. నిధులు మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ పాఠశాల సిబ్బంది ఎంపీకి సన్మానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉషాకిరణ్, ఎంపీపీ పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సర్పంచ్ పద్మప్రభాకర్, ఎంపీటీసీ శోభస్వామి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కాల్వల ద్వారా నీళ్లు ఇవ్వండి

దుబ్బాకరూరల్: ఎండలు ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని పంటలు ఎండిపోకుండా మల్లన్నసాగర్ నుంచి కాల్వల ద్వారా నీళ్లు విడుదల చేయాలని కోరుతూ అప్పనపల్లి, హసన్‌మీరాపూర్, నర్లెంగగడ్డ గ్రామాలకు చెందిన రైతులు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పోచాద్రి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

◆ వైఎస్సార్‌టీపీ హుస్నాబాద్ కో–ఆర్డినేటర్‌గా మల్లికార్జున్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ నియోజకవర్గ వైఎస్సార్‌టీపీ కో–ఆర్డినేటర్‌గా అయిలేని మల్లికార్జున్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం నియామకపత్రాలను అందించారు. పార్టీ విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే నమ్మకంతో కోఆర్డినేటర్‌గా నియమించినందుకు మల్లికార్జున్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

◆ కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

దుబ్బాక: విద్యార్థులు పరీక్షలపై భయాన్ని వీడి కష్టపడి చదివి ముందుకు సాగితే వందశాతం ఫలితాలను సాధించడం సులభమని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్‌జీ అన్నారు. దుబ్బాక పట్టణంలో సరస్వతీ గ్లోబల్ పాఠశాలలో పలు పాఠశాలల విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మారుతున్న పరీక్ష పత్రాలపై విద్యార్థులకు వివరించారు. దుబ్బాక, లచ్చపేట మోచీ కులస్తులతో సంత్ రవిదాస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయపాలన పాటిస్తూ నిర్భయంగా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు నారాయణ, సామాజిక సమరసత వేదిక జిల్లా కన్వీనర్ రమేశ్, తదితరులున్నారు.

◆ అన్నదాతల సంక్షేమానికి కృషి

గజ్వేల్‌రూరల్: అన్నదాతల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన రైతు చాడ జైపాల్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5లక్షల రైతుబీమా ప్రొసీడింగ్‌ను మంగళవారం రైతుబంధు మండల అధ్యక్షుడు రాజిరెడ్డితో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవోలు అనూష, సంగీత, ఫ్యాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఆనందం, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు అహ్మద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్థికసాయం

దుబ్బాకరూరల్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన మిద్దె నరేశ్ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పదో తరగతి–2006 బ్యాచ్ తోటి పూర్వ విద్యార్థులు రూ.21,500, క్వింటాల్ బియ్యం బాధిత కుటుంబానికి అందజేశారు.

◆ భూంపల్లి ఎస్‌ఐగా గంగరాజు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల ఎస్‌ఐగా వి.గంగరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నర్సాపూర్ పీఎస్ నుంచి ఆయన భూంపల్లి స్టేషన్‌కు బదిలీపై వచ్చారు.

◆ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

బెజ్జంకి(సిద్దిపేట): ఉపాధి కోసం మహిళా సంఘాలకు అందిస్తున్న వివిధ రకాల రుణాలతో యూనిట్లు పెట్టుకొని ఆదాయం పొందాలని డీఆర్డీఓ గోపాల్‌రావు సూచించారు. బెజ్జంకితో పాటు దాచారం గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు పీఎంఎఫ్‌ఎంఈలోని న్యూఎంటర్‌ప్రైజెస్‌లో తీసుకొని పెట్టిన పండి, కారం, పసుపు నూనె మిల్లులను పరిశీలించారు. వారికి వస్తున్న ఆదాయ, ఖర్చుల వివరాలు తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ రాము, డీపీఎం వాసుదేవ్, ఏపీఎం నర్సయ్య, సీసీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకే డబుల్ ఇళ్లు కేటాయించాలి



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూమ్‌లను అర్హులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ప్రభుత్వ అధికారులు రెండు దఫాలు సర్వే చేసిన పేదల పేర్లు జాబితాలో లేవని, ఒక్కొక్క ఇంట్లో ఇద్దరి పేర్లను జాబితాలో నమోదు చేసినట్లు వారు ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ స్పందించి ఎలాంటి భూములు లేని వారికి ఇళ్లు ఇస్తే వారికి న్యాయం చేకూరుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పీఏకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్, కోమటి స్వర్ణలత, వేణు, నాయకులు జనగామ వేణుగోపాల్‌రావు, కోమటి సత్యనారాయణ, వంగర మల్లేశం, అక్కు శ్రీనివాస్, పోలోజు రవీందర్, లబ్ధిదారులు ఉన్నారు. డబుల్ బెడ్రూంల జాబితాలో పేదల పేర్లు లేవని అధికారులు తప్పుడు సర్వే చేశారని మళ్లీ సర్వే చేసి అర్హులను జాబితాలో చేర్చాలని బీఎస్పీ నాయకులు ఎలగందుల శంకర్, వేల్పు రాజ్‌కుమార్ కోరారు.

మహిళా డిగ్రీ కళాశాలలో చేరాలి



వసతుల పోస్టర్, కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ కిషన్

నంగునూరు(సిద్దిపేట): మహిళా డిగ్రీ కళాశాలలో చేరిన విద్యార్థినులకు చదువుతో పాటు వృత్తి విద్యా కోర్సులు నేర్పిస్తారని లెక్చరర్లు విద్యార్థులకు సూచించారు. 2023–24 విద్యా సంవత్సరంలో సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాలలో చేరాలని కోరుతూ అధ్యాపకులు మంగళవారం అక్కేనపల్లి మోడల్ స్కూల్, నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్ణాదేవి, తిరుపతి మాట్లాడుతూ.. దూర ప్రాంతం నుంచి వచ్చే విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. అలాగే తమ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, సర్టిఫికెట్, వృత్తి విద్యా కోర్సులు, టైలరింగ్ శిక్షణ, మహిళా సాధికారత విభాగం ఉన్నాయన్నారు. సుశిక్షితులైన అధ్యాపకులు ఉన్నందున విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కిషన్, మోడల్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. తమ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీలో చేరేలా ప్రోత్సహిస్తామన్నారు.

'డబుల్ ఇళ్ల జాబితాపై ఆరోపణలు సరికాదు'



మాట్లాడుతున్న సర్పంచ్

మర్కూక్(గజ్వేల్): అర్హులకు డబుల్ ఇళ్లు అందిస్తామని సీఎం దత్తత గ్రామమైన నర్సన్నపేట సర్పంచ్ మాధవిరాజిరెడ్డి అన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ ఎదుట పాలకవర్గంతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో కొత్తగా 40 డబుల్ ఇళ్లను నిర్మాణించినట్లు తెలిపారు. కాగా గ్రామానికి చెందిన పలువురు గ్రామంలో ఇళ్ల విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారని తెలిపారు. వారు చేసిన ఆరోపణలు అవాస్తమని చెప్పారు. గ్రామంలోని అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలాంటి నీచమైన పద్ధతులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆరోపణలు చేసిన వారికి కూడా డబుల్ ఇళ్లు వచ్చాయని వివరించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో వార్డు సభ్యులు కనకరాజుయాదవ్, నర్సింహారెడ్డి, బాలమణి, శ్రీకాంత్, మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, రాంరెడ్డి, సాయిబాబా, మాధవ్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సంపూర్ణ సహకారం'



మాట్లాడుతున్న రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి రజని

సిద్దిపేటజోన్: కేంద్ర ప్రభుత్వాన్ని తిట్టడమే సీఎం కేసీఆర్ పనిగా పెట్టుకున్నారని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సంపూర్ణ సహకారాన్ని ఇస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాల్వాయి రజనీ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ బాంక్వెట్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై నిర్వహించిన సమీక్షలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ అన్ని వర్గాలకు అనుకూలంగా ఉందన్నారు. భవిష్యత్‌ను అంచనా వేసి కేంద్రం సముచిత బడ్జెట్ తయారు చేసిందని తెలిపారు. అన్ని రంగాల్లో మన దేశం అగ్రగామిగా ఉందని, అది మోదీ పాలన ద్వారా సాధ్యమైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, కనకయ్య, భూపతి, నారాయణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పొట్లపల్లి ఆలయ అభివృద్ధికి రూ.20లక్షలు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.20లక్షల నిధులను మంజూరు చేయనున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయ పరిసరాలను పరిశీలించి మహాశివరాత్రి ఉత్సవాల కోసం ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై గ్రామస్తులతో కలిసి చర్చించారు. ఆలయం ఎదుట సీసీరోడ్డు నిర్మాణం, పార్కింగ్ కోసం సీసీ ఫ్లోరింగ్ చేయడానికి రూ.20లక్షల వ్యయం అవుతుందని వీటిని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ నిధుల నుంచి మంజూరు చేస్తారని చెప్పారు. జాతర ముగిసిన తర్వాత అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. భక్తుల సౌకర్యం కోసం మున్సిపల్ వాటర్ ట్యాంకర్లను వినియోగించుకోవాలని, పారిశుధ్య నిర్వహణకు మున్సిపాలిటీ కార్మికులను పంపించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న తెలిపారు. వీరి వెంట సర్పంచ్ దేవసాని సుశీల, వాల నవీన్, పాకల శ్యాంసుందర్, రాచపెల్లి శ్రీనివాస్, అనిల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మోడల్ టెస్ట్ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 21న నిర్వహించనున్న మోడల్ టెస్ట్‌కు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మోడల్ టెస్ట్ నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో భయం పోతుందన్నారు. విద్యార్థుల్లో ప్రతిభ గుర్తించడం కోసం ఫిబ్రవరి 21వ మండల, జిల్లా స్థాయిలో ఈ మోడల్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారిలో మండలానికి ముగ్గురికి బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. నూతన సిలబస్ ఆధారంగా రూపొందించబడిన ప్రశ్నాపత్రం వంద మార్కులతో అన్ని సబ్జెక్టులలో మల్టిపుల్స్ రూపంలో, ప్రశ్నాపత్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఉంటుందని తెలియజేశారు. జిల్లా స్థాయి టెస్టులో ప్రతిభ కనబరిచిన పది మందికి ప్రత్యేక బహుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డమైన అరవింద్, దాసరి ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్, ఆముదాల రంజిత్‌రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు కర్రోల్ల నవీన్, నాచారం శేఖర్, చెప్యాల సంతోష్ పాల్గొన్నారు.

పక్కదారి పడుతున్న పాడి రైతుల ప్రోత్సాహక సొమ్ము

అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

మద్దూరు(హుస్నాబాద్): పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకం సొమ్ము అధికారుల నిర్వాహకంతో పక్కదారి పడుతున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో 60 మందికిపైగా పాడి రైతులు ఉన్నారు. వీరంతా గ్రామంలోని విజయ పాల కేంద్రంలో ప్రతీ రోజు 200 లీటర్లకు పైగా పాలుపోస్తారు. రైతులకు ప్రభుత్వం వెన్న శాతానికి అనుగుణంగా రైతులు పోసిన పాలకు బిల్లులు చెల్లిస్తుంది. రైతులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ లీటర్‌కు రూ.4చొప్పున ప్రోత్సాహకంగా అందజేస్తుంది. పాడి రైతులకు ప్రతీ నెల పాల బిల్లులతో కలిపి ప్రభుత్వ ప్రోత్సాహకం రైతుల ఖాతాలో వేస్తారు. ఇందుకు విరుద్ధంగా నర్సాయపల్లి పాల కేంద్రంలో పనిచేసే ఓ ఉద్యోగి భార్య బ్యాంక్ ఖాతాలోకి రైతుల ప్రోత్సాహక డబ్బులు ప్రతి నెల చేరుతున్నాయి. జనవరి నెలల్లో సైతం రూ.4,185లు జమయ్యాయి. సదరు ఉద్యోగి పాల కేంద్రంలో సభ్యుడు కాకపోవడంతో పాటు ఏరోజు పాల కేంద్రంలో పాలుపోసిన దాఖాలు లేవు. రైతులకు చెందాల్సిన ప్రోత్సాహకం డబ్బులు ఉద్యోగి ఖాతాలో మల్లించడం వెనుక విజయ డైయిరీ అధికారుల హస్తం ఉందని పలువురు పాడి రైతులు ఆరోపిస్తున్నారు. పాడి రైతుల ప్రోత్సాహక డబ్బులు కాజేస్తున్న ఉద్యోగితో పాటు అందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పాడి రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై చేర్యాల విజయ డెయిరీ కేంద్రం మేనేజర్ మురళిని వివరణ కోరగా.. జనవరికి సంబంధించిన రైతుల బిల్లుల వివరాలు మేము ఇప్పటివరకు రిలీజ్ చేయలేదని ఇందులో అవకతకలు జరిగే అవకాశం లేదన్నారు.